# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల
# సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

హిందీ — SATYA SUSAMACHAR

మంగళవారము
గురువారము
శుక్రవారము } 9.00 to 9-15 p. m.

ఆదివారము — 1-30 to 1-45 p. m.

ఇంగ్లీషు — THE VOICE OF TRUTH

ఆదివారము —9-30 to 9-45 p. m.

మంగళవారము — 9-30 to 9-45 p. m.

తమిళం — SATYA VAZHI

మంగళవారము — 5-30 to 5-45 p. m.

గురువారము — 6-45 to 7-00 p. m.

శుక్రవారము — 6-45 to 7-00 p. m.

మళయాళం — THE VOICE OF TRUTH

మంగళవారము — 3-45 to 4-00 p. m.

శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.

తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

**SATYA VANI**

**P. O. Box 80, KAKINADA-533 001**

Razan Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **8** మార్చి **1982** సంపుటి **2**


## సంపాదకీయము

### దేవుడు మానవునితో ఈనాడు ఎట్లు మాట్లాడుచున్నాడు?

*( How Does God Speak to Man Today ? )*

దేవునియందు విశ్వాసము కలిగియుండుట, ఆయన నేడు మానవునితో మాట్లాడుచున్నాడని నమ్ముటయే. నిజముగా పరలోకమందున్న దేవుడు మానవుని అజ్ఞానములో యుంచడు; ఉంచలేదు కూడ. ఆయన మనతో ఎట్లు మాట్లాడుచున్నాడనునది ఒక పెద్ద ప్రశ్న. ఆయన నేరుగా తన స్వరముతో ఒక దర్శనము, ఒక స్వప్నము, ఒక సూచనద్వారా లేక మరోవిధముగా మాట్లాడుచున్నాడా? ఆయన మాట్లాడుచున్నది కొందరితోనా? లేక అందరితోనా? ఆయన అందరితో ఒకే సంగతిని మాట్లాడునా? లేక వేర్వేరు సంగతులను బయలుపరచునా? ఈసంగతిని ప్రజలతో చర్చించునప్పుడు వారు రకరకాల జవాబుల నిత్తురు. అది చాల గందరగోళముగా యుండును. పరిశుద్ధాత్మడు వారిని నడిపించుచున్నట్లు అట్టివారందరు తలంతురు. ఇట్టి సంగతులపై మనము ఆధారపడగలమా?

## అన్నిటిని మనము నమ్మరాదని హెచ్చరింపబడితిమి

అపొ. యోహాను తన కాలపు క్రైస్తవులను ఈ రీతిగా హెచ్చరించెను. "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్ళి యున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" (1 యోహాను 4 : 1). అనేకులైన అబద్ధ బోధకులు, ఉపదేశకులు బయలు వెళ్ళి యున్నారు గనుక వారి ప్రతిబోధను లేక ఆత్మను నమ్మరాదని అతడు హెచ్చరించిన దానిని దయచేసి గమనించుము. అది ఈనాడు ఏమైనా వేరుగా యున్నదని నీవనుకొనుచున్నావా? అది ఏమియు వేరుగాలేదు గనుక యోహాను చేసిన హెచ్చరిక ఆనాడెట్లు వర్తించెనో ఈనాడు అట్లే వర్తించును. "అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరుచుటకై గొప్ప సూచక క్రియలను మహాత్కార్యములను కనబరచెదరు" అని యేసు చెప్పెను (మత్తయి 24:24). గలతీయులకు తాను పవిత్రమైన ఒకే సువార్తను ప్రకటించెనని పౌలు చెప్పెను. అదిగాక దానికి వేరైన ఇంకొక సువార్తను తానుగాని, పరలోకదూతగాని, ఇంకెవరైనాగాని బోధించిన యెడల దేవుని శాపము వారిపై నిలుచునని అతడు చెప్పెను. మనము అంగీకరించి దేవుని వాక్యమని బోధించు దానిని గూర్చి మనము చాల జాగ్రత్త కలిగి యుండవలెనని హెచ్చరించుటయే దీని ఉద్దేశ్యము.

## క్రీస్తుద్వారా దేవుడు మాట్లాడుచున్నాడు

హెబ్రీ లేఖకు డిట్లనెను: "పూర్వకాలమందు నానాసమయములలోను నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈదినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసు

నిగా నియమించెను" (హెబ్రీ 1 : 1, 2). ఇంకొక మాటలో వివిధ కాలములలో దేవుడు వివిధ రకములుగా మాటలాడినను మన దినములతో సహా యున్న ఈ అంత్యదినములలో తన కుమారుడైన యేసు ద్వారా మాటలాడెనని అతడు చెప్పుచున్నాడు. యేసు రూపాంతరము పొందినప్పుడు, పరలోకము నుండి దేవుడిట్లనెను : "ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను; ఈయన మాటలను వినుడి" (మత్తయి 17:5).

## లేఖనములద్వారా క్రీస్తు మాట్లాడుచున్నాడు

ఈలోకములో క్రీస్తు స్వల్పకాలము మాత్రమే యుండెను. అల్లయితే ఈనాడు ఆయన మనతో ఎట్లు మాట్లాడుచున్నాడు? మన ప్రభువు తన పరలోక తండ్రియొద్దకు ఆరోహణుడు కాకముందు తన అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించునట్లు పరిశుద్ధాత్మని పంపెదనని వాగ్దానము చేసెను (యోహాను 16:13). వారు దేవుని వాక్యమును బోధించునట్లును, క్రొత్త నిబంధనవలె దానిని వారు లిఖించునట్లును పరిశుద్ధాత్ముడు వారిని నడిపించెను (హెబ్రీ 9:15–17). అది అంతయు దైవావేశమువలన కలిగెనని, మానవుని ప్రతి సత్కార్యమునకు సంపూర్ణునిగా అది చేయునని మనకు చెప్పబడినది (2 తిమో 3:16, 17). మన జీవమునకు భక్తికి కావలసిన వాటినన్నిటిని దేవుడు మనకు దయచేసెనని పేతురు చెప్పెను (2 పేతురు 1:3). అందువలన మనము దానిని పఠించవలెను (2 తిమో 2:15), విశ్వసించవలెను (యోహాను 20:30, 31) మరియు దానికి విధేయత చూపవలెను (యాకోబు1:22).

## దేవుని చిత్తము అందరికీ వర్తించును

దేవుని వాక్యమును వినుటవలన విశ్వాసము కలుగునని పౌలు చెప్పుచున్నాడు (రోమా 10:17). "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు

రక్షించబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" అని చెప్పి క్రీస్తు అపొస్తలుల నాజ్ఞాపించెను (మార్కు 16:15, 16). ఈ గొప్ప ఆజ్ఞ ఇప్పటికింకను వర్తించును (మత్తయి28:19, 20). మరింకొక సందర్భములో, ఆకాశము భూమి గతించును గాని నామాటలు ఎన్నటికి గతింపనేరవు అని క్రీస్తు చెప్పెను (మత్తయి 24:35). మనము ఆయనను, ఆయన మాటలను నిరాకరించినయెడల ఆయన చెప్పిన మాటలే అంత్యదినమందు మనకు తీర్పు తీర్చును అని యోహాను 12:48 లో ఆయన చెప్పెను.

మిత్రులారా, లేఖనముల రూపమున ప్రభువు తన వాక్యమును మనకిచ్చియున్నాడు. ప్రపంచమందంతటా అన్నిభాషలలోను అది లభ్యమగుచున్నది. మనము తెలిసికొనాలని ఆయన కోరుచున్న ప్రతిదానిని గూర్చి ఆయన చెప్పియున్నాడు. లేఖనములనుండి వేరుగా ఆయన ఏమానవునితోను మాట్లాడుట లేదు. ఆయన సువార్తను బయలుపరచి యున్నాడు. తన సంఘమును గూర్చి ఆయన చెప్పి యున్నాడు. మనము ఎట్లు ఆరాధించవలెనో వివరించియున్నాడు. క్రైస్తవ జీవనమునుగూర్చి ఆయన ఎంతో చెప్పియుండెను. మనము పరలోకమునకు సిద్ధపడవలెనని ప్రోత్సహించు చున్నాడు; నరకమునకు పోవద్దని హెచ్చరించు చున్నాడు. దీనియంతటి తరువాత ఆయన ఇంకేమి చెప్పగలడు?

## విని లోబడుము

నీవు దేవుని వాక్యము విని ఆయనకు లోబడవలెనని నిన్ను ప్రోత్సహించు చున్నాను. దేవుని వాక్యమునే చదివి అది చెప్పుదానిని చేయుము. నీవట్లు చేసినయెడల ఆయన నిన్ను రక్షించి తన సంఘములో చేర్చుకొనును (అపొ. కా. 2:33; 47). ఒకక్రైస్తవునివలె అప్పుడు నీవు ప్రభువుని ఆరాధించి సేవించవచ్చును, యితరులకు సువార్త అందించవచ్చును, నీవాయనకు నమ్మకముగా యున్నయెడల

ఒకానొక దినమందు పరలోకము నీదగుననే నిర్ధారణ కలిగి యుండ వచ్చును. "జీవవృక్షమునకు హక్కుగలవారై గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు" అని క్రీస్తు చెప్పెను (ప్రకటన 22:14). దానికంటె ఇంకేమి నీవడుగ గలవు?

---

## రెండవ క్షమాపణ చట్టము

## *( The Second Law of Pardon )*

మానవుడు దేవుని బిడ్డ యగుటకున్న చట్టము విపులముగా యున్నది. మనము సువార్తను వినవలెను (రోమా 1:16), విశ్వసించ వలెను (హెబ్రీ 11:6), పాపములన్నిటిని గూర్చి మారుమనస్సు పొంద వలెను (అపొ. కా. 2:38), క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనవలెను (అపొ. కా. 8:37), బాప్తిస్మములో ఆయనతో కూడ పాతిపెట్టబడ వలెను. అక్కడ ఆయన రక్తము మనలను పవిత్రులనుగా చేయును (రోమా 6:1-6).

మనము దేవుని బిడ్డలయిన తరువాత పాపము చేస్తే ఎట్లా? మనము క్షమాపణ పొందుటకు ఇంకో చట్టము ఉన్నదా? దేవుని నుండి దూరముగా తొలగిపోయిన క్రైస్తవులు మరల దేవుని యొద్దకు ఎట్లు చేరుకొందురు? క్రైస్తవులవలె మనము దేవుని చట్టము నతిక్రమించిన యెడల మనము ఎట్లు పునరుద్ధరించ బడగలము? (గలతీ 6:1). దేవుని రెండవ క్షమాపణ చట్టమును గూర్చి అపొ. కా. 8:18-24 లో మనము చూడగలము.

## I పాపము చేసిన క్రైస్తవుడు :

1. పాపములో యున్న అన్యుడు (అవిశ్వాసి)కాడు గాని అతడు ఒక కుమారుడు, దత్తపుత్రుడు. గనుక అవిశ్వాసి (అన్యుని) యొక్క క్షమాపణ చట్టము అతనికి వర్తించదు.

2. విశ్వాసభ్రష్టుడు కాడు. అతడు విశ్వాసమును పరిత్యజించి దేవ దూషణచేసి మారుమనస్సు పొందలేనంతగా పాపములో బడి యున్నవాడు కాడు. అంతగా పడిపోయినవాడు మారుమనస్సు పొందజాలడు (హెబ్రీ 6:4-6).

3. అతడు దోషియైన సహోదరుడు, నిత్యనాశనమునకు పోయే మార్గములో యున్నవాడు (యాకోబు 5:19-20).

4. అతడు కాల్చివేయబడు నట్టి నిష్ఫలమైన తీగవంటి వాడు (యోహాను 15:5, 6).

5. అతడు నిత్య నిరీక్షణ యొక్క వెలుగులేక చీకటిలో నడుచు చున్నవాడు (1 యోహాను 1:6-7).

6. అతడు పెండ్లి కుమారుని ఎదుర్కొనుటకు సిద్ధపడి యుండలేని బుద్ధిలేని కన్యక వంటివాడు (మత్తయి 25:11).

## II తొట్రిల్లిన క్రైస్తవుడు ఏమి చేసెను ?

1. కృప నుండి తొలగిపోయెను (ప్రకటన 2:5; గలతీ 5:4).

2. సంఘమునకు సహోదరులకు అవమానము తెచ్చెను.

3. ఇతరుల యెదుట అభ్యంతరము కలుగజేసెను. అవినీతివలన సత్యమునకు ఆటంకము కలుగజేసెను (మత్తయి 5:13; రోమా 1:18; లూకా 13:7).

4. తన అవయవములను అపవాదికి అప్పగించి కృపలో పెరుగలేక పోయెను (రోమా 6:16-17; 2 పేతురు 3:18).

## III తొట్రిల్లిన క్రైస్తవుని విచార పరిస్థితి :

1. క్రైస్తవుడు కాకముందటికంటె ఘోరస్థితిలో యున్నవాడు. కుక్క తన వాంతికి తిరిగినట్టి, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్ళినట్టి పరిస్థితిలో యున్నవాడు (2 పేతురు 2 : 21, 22).
2. అతడు నాశనమగుచున్నవాడు (అపో. కా. 8:20).
3. అతని హృదయము దేవుని దృష్టిలో సరియైనది కాదు (అపో.కా. 8 : 21).
4. అతడు ఘోర దుష్టత్వములోను దుర్నీతి బంధకములోను ఉన్న వాడు (అపో. కా. 8:23).
5. అతడు దేవుని దృష్టిలో దౌర్భాగ్యుడు, దిక్కుమాలినవాడు, దరిద్రుడు, గుడ్డివాడు మరియు దిగంబరుడు (ప్రకటన 3:16,17)

## IV తొట్రిల్లిన క్రైస్తవుడు క్షమాపణ పొందేచట్టము :

1. అతడు తాను పడిపోయిన స్థానమును, తన మొదటి ప్రేమను జ్ఞాపకముంచు కొనవలెను (ప్రకటన 2:4,5).
2. అతడు మారుమనస్సుపొంది ఆ మొదటి క్రియలను చేయవలెను (ప్రకటన 2:15; అపో. కా. 8:22).
3. తనతప్పుల నొప్పుకొనవలెను (1 యోహాను 1:9; యాకోబు 5:16; కీర్తన 32.5; సామె 28:13,14; యోబు 1:1[illegible], 1[illegible]). వ్యక్తిగత పాపములను దేవుని యెదుటను, బహిరంగ పాపములను సంఘము యెదుటను ఒప్పుకొనవలెను.
4. అతడు క్షమాపణ కొరకు ప్రార్థించవలెను. సహోదరులుకూడ అతని కొరకు ప్రార్థించవలెనని అడుగవలెను (అపో. కా.8:24; యాకోబు 5:16).

## V నమ్మకముగాయున్న క్రైస్తవులు, సంఘము ఏమిచేయ వలెను?

1. మనము విపులముగా మాట్లాడవలెను, తొట్రిల్లినవానిని గద్దించి పునరుద్ధరించవలెను (గలతి 6:1; 1 థెస్స 5:14; అపొ. కా. 8:20-24).
2. దోషులైన ఈ యాత్మలను మరణమునుండి మనము రక్షించవలెను (యాకోబు 5:19, 20).
3. విశ్వాసమునందు బలహీనులైనవారిని మారుమనస్సు పొందిన వారిని మనము ప్రేమతో క్షమించి చేర్చుకొనవలెను (రోమా 14:1).
4. అక్రమముగా నడుచుకొను వారినుండి మనము తొలగి పోవలెను (రోమా 16:17; 1 కొరింధి 5:1).

## VI తొట్రిల్లిన తన బిడ్డలకు దేవుని వాగ్దానములు :

1. కొలత లేకుండా ఆయన క్షమించును (యెషయా 1:18; 1 యోహాను 1:9).
2. ఆయన తన కోపమును పట్టనీయడు (యిర్మీయా 3:12, 13);
3. తన కుమారుడు చనిపోయి బ్రదికెనని, తప్పిపోయి దొరికెనని ఆయన సంతోషించును (లూకా 15:32).
4. దిగజారిపోయిన వారిని స్వస్థపరచి, సంతోషముతో వారిని అంటు కట్టును (యిర్మీయా 3:22; రోమా 1:20-23)

"దేవా నాయందు శుద్ధ హృదయము కలుగజేయుము, నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము. నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము, నీరక్షణానందము నాకు మరల పుట్టించుము. సమ్మతిగల మనస్సు కలుగజేసి నన్ను దృఢపర

చుము. అప్పుడు అతిక్రమము చేయువారికి నీ త్రోవలను బోధించె దను. పాపులును నీతట్టు తిరుగుదురు" (కీర్త 51:10-13).

క్రైస్తవ మిత్రుడా, నీ ప్రియులయెదుట మిత్రులయెదుట క్రీస్తును అయోగ్యముగా ప్రవర్తించిన యెడల, నీవు సంఘమునకు, కూటములకు నమ్మకముగా లేనియెడల, నీవు మరల పాపముతో చుట్టబడిపోయిన యెడల ఈరోజే నీవు పునరుద్ధరించబడుట అవుసరము. నీ వెక్కడనుండి పడిపోతివో జ్ఞాపకము చేసికొని, పాపములనుగూర్చి మారుమనస్సు పొంది, నీదోషములను దేవునియెదుట, సహోదరుల యెదుట ఒప్పుకొని పరలోక తండ్రితో సంపూర్ణ సహవాసము కలిగి యుండునట్లు క్షమాపణకొరకు ప్రార్థించుము. పాపముయొక్క దుష్టత్వము వలన మారు మనస్సు పొందలేని స్థితికి నీహృదయము రాకముందు తొట్రిల్లిన క్రైస్తవుని క్షమాపణకొరకున్న దేవుని ఆజ్ఞలకులోబడుము.

—మేక్ లేటన్.

---

## సబ్బాతు సంగతి యేమిటి?-4
### (*What about the Sabbath?*)

—ఆల్బర్ట్ గార్డనర్

### అదివారమున ఆరాధించుట బైబిలు నందున్నదా ?

సిలువకు మేకులతో కొట్టివేయ బడుటవలన విశ్రాంతి దినము ఎత్తివేయబడెనని చెప్పిన తరువాత ఆదివారమునాడు ఆరాధించుటకు మనము బైబిలు అధికారమును కనుగొన వలెను. అది దేవుని బోధా? లేక మానవునిదా? అది మానవుని నుండి కలిగిన యెడల దానికి బైబిలు అధికారము లేదు గనుక దానిని మనము విడిచి పెట్టవలెను. మనము చేయు ప్రతి ఆత్మీయ సంగతికి బైబిలు అధికారము అవుస రము. "ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తల రాయి

ఆయెను. అది యెహోవావలన కలిగినది. అది మన కన్నులకు ఆశ్చర్యము, ఇది యెహోవా ఏర్పాటుచేసిన దినము. దీనియందు మనము ఉత్సహించి సంతోషించెదము" (కీర్తన 118:22-24).

"ఇల్లుకట్టువారు నిషేధించిన రాయి" యేసును సూచించుచు చెప్పినమాట యనుటలో సందేహ మేమియు లేదు. అపొ. కా. 4:11లో ఇదే వచనమును అపొ. పేతురు యేసుకు వర్తింపజేసెను. నిషేధించబడిన ఆరాయి యేసుగాని, అది మూలకు తలరాయి ఆయెను. ఆయన మూలకు తలరాయి ఎప్పుడయ్యెను? ఆయన మృతులలోనుండి లేచినప్పుడే ఖచ్చితముగా తలరాయి అయ్యెను. యేసు బోధించినదంతయు, తననుగూర్చి చెప్పుకొన్నదంతయు ఆయన సమాధినుండి మూడవ దినమున తిరిగి లేచుటపై మోపెను. "ఆదివారమున తెల్లవారినప్పుడు యేసులేచి తాను ఏడు దయ్యములను వెళ్ళగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను" (మార్కు 16:9). యేసు ఆదివారమున సమాధి నుండి తిరిగి లేచెను గనుక ఆదినమున ఆయన మూలకు తలరాయి అగుట నీవు చూచుచున్నావా ?

ఇది యెహోవావలన కలిగెను అని కీర్తనల గ్రంథకర్తచెప్పెను. ఇది యెహోవా ఏర్పాటు చేసిన దినము. ఇది ప్రభువు దినము. ఏది ప్రభువు దినము? యేసు మూలకు తలరాయి చేయబడిన దినమే ప్రభువు దినము, యేసు తన పునరుత్థాన దినమందు మూలకు తలరాయి చేయబడెను గనుక ఆదివారమే ప్రభువు దినము.

"నేను ప్రభువు దినమందు ఆత్మవశుడనై యుంటిని" యని చెప్పుటలో అపొ. యోహాను యొక్క భావము కూడ అదియే (ప్రకటన 1:10). ఒక విధముగా దినము లన్నియు ప్రభువుకే చెందునుగాని, ఈ దినమందు ఆయన తిరిగి లేచెను గనుక ఇది ఆయనది. అన్నిరకములైన భోజన పదార్థములను ఆయన మన కిచ్చుచున్నాడు గనుక అవి ఆయనకు చెందును. అయితే ఇంకొక విధముగా ప్రభు రాత్రి భోజనము

ఆయనది. అట్లే దినము లన్నియు ఆయనకే చెందినను ఇంకొక విధ
ముగా ఆదివారము ఆయనది.

## 2 కొరింథీ 3:7–11

ఈ లేఖన భాగమును లోతుగా చదివిన యెడల సబ్బాతు దిన
ముతో కూడిన ధర్మశాస్త్రము ఎత్తివేయబడెనని గ్రహింపగును. పాత
క్రొత్త నిబంధనల తారతమ్యము అక్కడ యున్నది. దానిని వచన
ముల వారీగా గమనించుము.

7వ వచనము : ఒక ధర్మశాస్త్రము మరణ కారణమగు పరి
చర్య యని పిలువబడెను. దానిని సులువుగా గుర్తించుటకు దానిని
గూర్చి రెండు సంగతులు చెప్పబడెను. మొదటిగా, అది రాళ్ళమీద
చెక్కబడి వ్రాయబడెను. రెండవదిగా, అది ఇయ్యబడి నప్పుడు
మోషే ముఖము ప్రకాశించెను (నిర్గమ 34 : 29-35). పది ఆజ్ఞల
ధర్మశాస్త్రము గాక ఈ వర్ణనకు సరిపడు ధర్మశాస్త్రము ఏదైనా
ఒకటి యున్నదా ! ఈ ధర్మశాస్త్రమును గూర్చి చెప్పబడినది ఏదయి
నను, అతడు సబ్బాతును గూర్చిన ఆజ్ఞ యున్న రాతి పలకలను గూర్చి
చెప్పుచున్నాడని మన మెరుగుదుము. ఈ ధర్మశాస్త్రము మహిమ
కలది యని చెప్పబడెను. అది ఎత్తివేయ బడవలెను.

8వ వచనము : క్రొత్త నిబంధన ఆత్మ సంబంధమైన పరిచర్య
యని చెప్పబడెను. రాళ్ళపై చెక్కబడి వ్రాయబడినది మహిమగలది
యైతే, యిది అత్యధిక మహిమ గలదియై యుండెను.

9వ వచనము : శిక్షావిధికి కారణమైన పరిచర్య మహిమ కలి
గినదైతే నీతికి కారణమైన పరిచర్య యెంతో అధికమైన మహిమకలది.

10వ వచనము : రాళ్ళమీద వ్రాయబడినది మహిమగలదియై
నాను, క్రొత్త నిబంధనతో పోల్చి చూచి నప్పుడు దీని మహిమ అత్య
ధికమైనది గనుక ఇంతకు మునుపు మహిమకలదిగా చేయబడినది
మహిమ లేని దాయెను.

11వ వచనము : రాళ్ళమీద వ్రాయబడినది మహిమ కలది యని చెప్పబడెను. అది ఎత్తివేయబడెను (7వ). ఇప్పుడు నిలుచునది మరి యెక్కువ మహిమ గలది.

రాళ్ళమీద చెక్కబడిన ధర్మశాస్త్రము ఎత్తివేయ బడినందున, సబ్బాతు దినము ఆ ధర్మశాస్త్రములో ఒక భాగమై యున్నందున అది యును ఎత్తివేయబడెనను సత్యమును మనము అంగీకరించ వలెను.

## సంగ్రహము

లేఖనములనుండి ఈదిగువ సంగతులను నిరూపించితిమని నా విశ్వాసము:

1. మోషే ధర్మశాస్త్రము, యెహోవా ధర్మశాస్త్రము అనునవి ఒకటేగాని రెండుకాదు.

2. పది ఆజ్ఞలను దేవుడే ప్రజలకు వినిపించెను. తరువాత మిగిలిన ఆజ్ఞలుకూడ ఒక గ్రంథమందు వ్రాయబడి, రాతిపలకలను గూర్చి చెప్పబడక ముందు ప్రజలకు మోషేచే చదివి వినిపించబడెను.

3. తాము ఐగుప్తు నుండి విమోచింపబడిన సంగతిని జ్ఞాపకముంచుకొను నిమిత్తము సబ్బాతు యూదులకు ఈయబడెను.

4. మధ్యాహ్న కాలమందు సూర్యుడస్తమించినప్పుడు సబ్బాతు అంత మొందెను. యేసు సిలువపై మరణించినప్పుడు మధ్యాహ్న కాలమందు సూర్యుడస్తమించెను. క్రీస్తు సిలువ యొద్ద సబ్బాతు అంత మొందెను.

5. తన పునరుత్థాన దినమందు యేసు మూలకు తలరాయి ఆయెను. ఆయన ఆదివారమునాడు పునరుత్థానుడాయెను. ఇది యెహోవా ఏర్పాటుచేసిన దినము.

సబ్బాతు ఆచరణగూర్చి తీవ్రముగా పరిశోధించవలెననికోరుచు ఈచర్చను ఎట్లు ఆరంభించితిమో అదేకోరికతో దీనిని ముగించుచున్నాము. దేవునికి విధేయులైన వారు మాత్రమే రక్షింపబడుదురని

మనిద్దరము నమ్ముదుము. అందువలన దేవునికి లోబడగల్గునట్లు ఆయన ఏమి చెప్పెనో మనము తెలిసికొనుట చాల ప్రాముఖ్యము.

( సమాప్తము )

---

## బాప్తిస్మమును గూర్చిన 24 ప్రశ్నలు, జవాబులు

*( 24 Questions & Answers about Baptism )*

(గత సంచిక తరువాయి)

8. ఒకడు బాప్తిస్మము పొందు నప్పుడు సాక్షులు ఉండుట అవసరమా?

కాదు. జరుగుచున్నదంతయు దేవుడెరుగును. మానవుల సాక్ష్యము అవుసరము లేదు. ఐతియొపీయ ఘనుడు యెరూషలేమునుండి గాజాకు పోవు మార్గములో బాప్తిస్మము పొందెను. ఎవరైనా బాప్తిస్మము పొందినప్పుడు పెక్కుమంది సాక్షులున్నట్లుగాని, వారములో ఫలాని రోజున బాప్తిస్మము పొందినట్లుగాని మనము ఎక్కడా చదువము. ఐతియొపీయుడు తాను బాప్తిస్మము పొందవలెనని గ్రహించగానే బాప్తిస్మము పొందెను.

9. ప్రత్యేకముగా బాప్తిస్మము లిచ్చేవారున్నారా?

లేరు. ఇతరులకు బాప్తిస్మము లిచ్చుటకు ప్రత్యేకముగా యున్న క్రైస్తవులను గూర్చి బైబిలులో ఎక్కడా లేదు. బాప్తిస్మము అవుసరమైన వారికి క్రైస్తవు డెవరయినను బాప్తిస్మము ఇయ్య వచ్చును.

10. బాప్తిస్మము ఒక ఆజ్ఞయైన యెడల, బాప్తిస్మము ఎవరికి ఆజ్ఞాపింపబడినది?

రక్షింపబడగోరు వారికి బాప్తిస్మము అవసరము. బాప్తిస్మము పొందుటకు ముందు ఒకడు సువార్తను విశ్వసించవలెను (మార్కు 16:16), తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను (అపొ. కా. 2:38), యేసు దేవుని కుమారుడని తాను విశ్వసించుచున్నట్లు ఒప్పుకొనవలెను (రోమా 10:10; అపొ. కా. 8:37). సువార్త బోధింపబడినవాడు, మారుమనస్సు పొందిన విశ్వాసి, తన విశ్వాసమును ఒప్పుకొనినవాడు బాప్తిస్మము పొందవచ్చును.

11. బాప్తిస్మము అను ఆజ్ఞ క్రైస్తవులకా? క్రైస్తవులు కానివారికా?
అది క్రైస్తవులు కానివారికే. బైబిలులో రక్షింపబడిన వాడెవడును బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపింపబడలేదు. ఒకడు రక్షింపబడుటకు బాప్తిస్మము పొందును (మార్కు 16:16).

12. బాప్తిస్మము పసిబిడ్డలకా?
కాదు. పసిబిడ్డలు విశ్వసించలేరు, మారుమనస్సు పొందలేరు, విశ్వాసమును ఒప్పుకోలేరు. వారు నశించినవారు కాదు. నశించిపోవు ఆత్మలు మాత్రమే రక్షింపబడుటకు బాప్తిస్మము పొందవలెను.

13. క్రైస్తవ తలిదండ్రులు తమ పసిబిడ్డలకు బాప్తిస్మము ఇప్పించవలెనని ఆజ్ఞాపింపబడిరా?
లేదు. అట్టి ఆజ్ఞలేనే లేదు. శిశుబాప్తిస్మము యొక్క మాదిరి లేఖనములలో లేదు.

14. చిన్నప్పుడుపొందిన బాప్తిస్మము పెద్దయినప్పుడు పనికివచ్చునా?
అట్టి ప్రశ్న లేనేలేదు. బాప్తిస్మము పొందుటకు పసివారు అర్హులు కారు. చిన్నప్పుడు వారికేమి చేయబడినను తరువాత దేవునితో వారికిగల సంబంధమును అది మార్చలేదు.

15. బాప్తిస్మము పొందుటకు ఎంతవయస్సు ఉండవలెను?

ఒకడు దేవునికి వ్యతిరేకముగా పాపము చేసితినని గ్రహించునంత వయస్సు ఉండవలెను; దేవునికి తాను బాధ్యుడనని గ్రహించునంత వయస్సు ఉండవలెను. ఇట్టి గ్రహింపు అందరికీ ఒకే వయస్సునందు కలుగదు గనుక ఇంత వయస్సు ఉండవలెనని మనము చెప్పలేము.

16. బాప్తిస్మముయొక్క ఉద్దేశ్యమేమి?

రక్షించుటకు (1 పేతురు 3:21). పాపములను కడిగి వేయుటకు (అపొ. కా. 22:16), పాపక్షమాపణకొరకు (అపొ. కా. 2:38), క్రీస్తులోనికి ప్రవేశించుటకు (గలతి 3:27; రోమా 6:3). బాప్తిస్మము పొందకముందు ఒకడు నశించినవాడు. లేఖనానుసారమైన బాప్తిస్మము పొందగా ఒకని పాపములు క్షమించబడును, అతడు రక్షింపబడును. పాపులైన అన్యులు క్రీస్తుసువార్తకు లోబడినప్పుడు క్రీస్తు రక్తము వలన రక్షింపబడుదురు గాని అంతకు ముందుకాదు.

17. బాప్తిస్మము సంఘములో చేర్చునా?

అవును, అది క్రీస్తుశరీరమైన సంఘములో చేర్చును (1 కొరింథి 12:13; ఎఫెసీ 1:22, 23). ఒకనిపాపములు క్షమింపబడి క్రొత్త జన్మ సంపూర్తి గావించబడు సమయమది. అతడు విశ్వసించి, మారుమనస్సు పొంది, అతని విశ్వాసమును ఒప్పుకొని బాప్తిస్మము పొందినప్పుడతడు దేవుని బిడ్డయగును.

18. పాపి తిరిగి జన్మించెనని బాప్తిస్మము చూపించునా?

లేదు, ఒకడు బాప్తిస్మము పొందువరకు అతని క్రొత్తజన్మ సంపూర్తికాదు. బాప్తిస్మము పొందకముందే రక్షింపబడితినని చెప్పుకొనువారు బాప్తిస్మముయొక్క ప్రయోజనమును అపార్థము చేసికొన్నవారు.

19. క్షమాపణ పొందుటకు బాప్తిస్మము అనే షరతుకు లోబడ వలెనా?

అవును. పెంతెకొస్తునాటినుండి బాప్తిస్మము పొందకముందు యెవరును క్షమాపణ పొందలేదు. గత పాపముల క్షమాపణ పొందుటకొరకే బాప్తిస్మము (అపొ. కా. 2:38).

20. తప్పుడు ప్రయోజనమునకు పొందిన బాప్తిస్మము నిష్ప్రయోజనమగునా?

కేవలము నీటిలో ముంచబడుట బాప్తిస్మము కానేకాదు. ఒకడు బాప్తిస్మము పొందేవరకు రక్షింపబడలేదు గనుక, తానురక్షింపబడితినని చెప్పుట కొరకు బాప్తిస్మము పొందుట అసాధ్యము.

21. ముంచడము పొందితిమని చెప్పుకొను వారందరినీ సహవాసము లోనికి మనము చేర్చుకొనవచ్చునా?

లేదు. లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందని వారెవరినీ మనము చేర్చుకొరాదు. ప్రజలకు వాక్యము బోధింపబడగా వారు విని, విశ్వసించి, మారు మనస్సుపొంది, క్రీస్తును ఒప్పుకొని బాప్తిస్మము పొందినప్పుడు వారు దేవుని బిడ్డలగుదురు, అట్టివారిని సంఘములో ప్రభువే చేర్చును.

22. బాప్తిస్మమునుగూర్చి మోసగించబడిన వారి కేమగును?

దీనిని దేవునికే వదిలి వేయవలెను. బాప్తిస్మమును గూర్చిన సత్యమును తెలిసికొని లోబడినవారి రక్షణనుగూర్చి సందేహమింత నక్కరలేదు.

23. నీవు పొందిన బాప్తిస్మమునుగూర్చి సంశయ మేమైనా యున్న యెడల నీవు తిరిగి బాప్తిస్మము పొందవలెనా?

యిది నీకున్న సంశయముపై ఆధారపడియున్నది. బాప్తిస్మము పొందిన తరువాత నీవు యెక్కువ నేర్చుకొనిన యెడల, పెంతెకొస్తునాడు బాప్తిస్మము పొందినవారికి ఎంత తక్కువ తెలుసో

గమనించవలెను. సువార్తకు లోబడిన తరువాత నీవు పెరుగ వలెను. నీ బాప్తిస్మమును గూర్చి ఇంకా తీవ్రమైన ప్రశ్న యున్న యెడల ఒక క్రైస్తవ సహోదరునితో కలసి ఈ అంశ మును ఇంకా పఠించుట మంచిది. నీవు రక్షింపబడితివో లేదో అనుదానిని గూర్చి సంశయము ఉండరాదు.

24. నేను ఇప్పుడే బాప్తిస్మము పొందవలెనా ?
నీవు లేఖనానుసారమైన బాప్తిస్మము పొందని యెడల ఇప్పుడే బాప్తిస్మము పొందవలెను. ఆలసించిన ప్రమాదకరము కాగ లదు. నీవు బాప్తిస్మము పొందగోరుచున్న యెడల నీకు సమీప ముగా యున్న క్రీస్తు సంఘమును దర్శించుము. లేదా ఈరోజే మాకు తెలియజేయుము. మేము సంతోషముతో తగు ఏర్పాట్లు చేయగలము.

(సమాప్తము)

---

# INRI యొక్క అర్థమేమిటి?

సిలువపై సాధారణముగ కనబడు INRI అను అక్షరముల పూర్తిభావమేమిటో యని చాలమంది తెలిసికొన గోరుదురు. ఒరిస్సా లోని బరంపురం క్రీస్తు సంఘమునుండి సహో. Y. తాతారావుగారు దీనినిగూర్చి వివరించుమని మాకు వ్రాసిరి.

సిలువ వేయబడిన నేరస్థుని తలపైని అతని నేరమును ఒక పలక మీద వ్రాసిపెట్టుట రోమీయుల ఆచారము. INRI అను అక్షర ములు క్రీస్తు సిలువయొక్క చిత్రములపై మనము తరచు చూచు చుందుము. ఈసిలువను చిత్రీకరించుటలో ఆచిత్రకారుడు తన స్వంత ఊహను వినియోగించి చిత్రీకరించెనని మనము జ్ఞాపకముంచుకొన

వలెను. క్రీస్తు సిలువ గన్న వేశము యేలాగుండెనో, ఆసిలువపై ఆయన నేరమును సూచించు ఈపలక ఎట్లువ్రేలాడ చేయబడెనో మనలో యెవనికి తెలియదు. గాని 13వ శతాబ్దమునాటికి కళాకారులు INRI అను అక్షరములను సిలువ పటములపై చిత్రీకరించుట మొదలిడిరి.

క్రీస్తు సిలువపై యేమి వ్రాయబడెనో యోహాను 19:19-22లో మనము తెలిసికొన గలము. "మరియు పిలాతు యూదుల రాజైన నజరేయుడగు యేసు అను పై విలాసము వ్రాయించి సిలువమీద పెట్టించెను. యేసు సిలువ వేయబడిన స్థలము పట్టణమునకు సమీపమై యుండెను. అది హెబ్రీ గ్రీకు రోమా భాషలలో వ్రాయబడెను గనుక యూదులలో అనేకులు దానిని చదివిరి. నేను యూదులరాజునని వాడు చెప్పినట్టు వ్రాయుముగాని యూదులరాజు అని వ్రాయవద్దని యూదుల ప్రధాన యాజకులు పిలాతుతో చెప్పగా పిలాతు - నేను వ్రాసినదేమో వ్రాసితినని నెను".

యూదుల రాజైన నజరేయుడగు యేసు అను అర్థమిచ్చు నాలుగు లాటిన్ పదములగు Iesus Nazarenus Rex Iudaeorum అను వాటి మొదటి అక్షరములే INRI. అయితే ఆమాటలు లాటిన్ లో మాత్రమే వ్రాయబడలేదు. గాని యేసుపై మోపబడిన నేరమును అందరు చదువుకొనునట్లు అవి హెబ్రీ, గ్రీకు భాషలలోకూడ వ్రాయబడవలెనని పిలాతు ఆజ్ఞాపించెను. అది అట్లు జరిగెనని లేఖనములను బట్టి మనము తెలిసికొనగలము.

---

## దేవుడు ఒక్కడే

దేవుడొక్కడే అని నమ్మె నవలంతా ఒక్క మతముగా లేరు. ఒక్క నామము, ఒక్క రూపముకాదు, ఒక్క కులముకాదు. ఒక సిద్ధాంతము కాదు. ఇన్ని విభేదములుగా ఎందుకని యున్నారు?

1. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యులు, పక్షులు, జంతువులు, పురుగులు మొదలగు వాటి ప్రతిమా స్వరూపమునకు మార్చిరి.
2. మరికొందరు దేవునిని ఆశ్రయించుటలో, ఆత్మరక్షణ యొక్క ప్రాముఖ్యతను గుర్తించక ప్రకృతి సంబంధమగు రోగస్వస్థత, సిరిసంపదలు మొదలగు బాహ్యకోరికల కొరకు దేవుని నమ్ముకొని ప్రార్థించుచున్నారు.
3. అలాగే దేవునిచట్టమై యున్న క్రొత్త నిబంధనగ్రంథము నుండి కొన్ని తీసివేసి కొన్ని పాతనిబంధన పద్ధతులను మరికొన్ని మానవ కల్పిత సిద్ధాంతములను చేర్చి దేవునిని ఆరాధించుచున్నారు.
4. మరియు కొందరు "పరిశుద్ధాత్మ నడిపింపు" అని చెప్పుకొనుచు క్రిందపడి దొర్లుట, శరీరమును కుదుపుకొనుట, అర్థము కాని శబ్దములతో కేకలు పెట్టుట, బట్టలు కానకుండా గంతులు వేయుట మొదలగు కార్యములను చేయుచున్నారు.
5. క్రీస్తుచే స్థాపించబడిన క్రీస్తుసంఘమును విడిచి, పెంతెకొస్తు సంఘము, లూథరన్ సంఘము, బాప్టిస్టు సంఘము మొదలగు మానవ కల్పిత నామములతో సంఘములను స్థాపించుకొనుచున్నారు. ఇవన్నియు దేవునియందు ఆసక్తి కలిగే చేయుచున్నారు. గాని వారి ఆసక్తి దేవుని చిత్తానుసారమైనది కాదు. అందుచే ఇన్ని మతములు, మతశాఖలు వెలయుచున్నవి. "నేను చెప్పు మాటలు ప్రకారము చేయక ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" అని యేసు ప్రభువు అడుగుచున్నాడు.

గనుక దేవుని చిత్తమును ఉన్నది యున్నట్లుగా తెలిసికొనుటకు మీ బైబిలును చదువవండి.

—పాల్ గూటం, గొల్లవిల్లి.

# నాడు - నేడు

సుమారు 2 వేల సం॥లకు పూర్వము యేసుక్రీస్తు ప్రభువు దేవుని చిత్తమును బయలుపర్చి, మానవులను వారి పాపములనుండి విడిపించి, రక్షించుటకు భూలోకమున దేవుని అద్వితీయ కుమారుసిగా అవతరించెను (యోహాను 3:16). పతనమైన మానవుని యెడల తన ప్రేమను వెల్లడి పర్చెను. లేఖనముల ప్రకారము మనుష్యులను రక్షించుటకొరకు సిలువ మరణము పొంది మూడవ దినమున తిరిగి లెచెను (1 కొరి 15:3). ఈ సత్య సువార్తను నమ్మి, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన రక్షణ కలుగునని ప్రభువు చెప్పెను (మత్తయి 28:19, మార్కు 16:16, అపొ. కా. 2:38).

అయితే ఆనాడు ఆదిమ క్రైస్తవులు ఒకే మాదిరిగా దేవుని ఆరాధించిరి. కాని నేటి క్రైస్తవ్యము క్రీస్తు బోధయందు నిలచియుండక, ఆయన చెప్పినదానికి కొంత కలిపి, కొంత తీసివేయుటవలన కొన్ని వందలకుపైగా భిన్నమైన సంఘములుగా సాగిపోవుచున్నది(2 యోహాను 9 వచనము). మరియు క్రీస్తు రాయబారియైన పౌలుకూడ ఈభిన్నమైన సంఘములకు లేక మతశాఖలుగా విడిపోవుటనుగూర్చి ముందుగానే హెచ్చరించియున్నాడు (గలతి 1:6-10, రోమా 16:17-18).

క్రీస్తు ప్రభువు సిలువ మరణమునకుముందు తనయందు విశ్వాసముంచు వారందరు ఏకమై యుండవలెనని ప్రార్థించెను. అందునుబట్టి క్రీస్తు, ఐక్యమును కోరలేదు గాని ఏకత్వము కోరెను (**Unity but not Union**) క్రొత్తనిబంధనలోని సంఘమునకు ఏకత్వము సూచించుచు క్రీస్తు రాయబారులు భిన్నత్వమును ఖండించుచు హెచ్చరించిరి. ఆనాటి ప్రభువు ప్రార్థన, క్రీస్తు రాయబారుల సందేశములు నేటి క్రైస్తవులు పెడచెవిని పెట్టి, ఏకముగా నుండకుండా ఐక్యమనుచు భిన్నమైన సేవ చేయుచున్నారు. వాక్యానుసారమైన పేరు, ఆరాధనా

క్రమము సంఘజీవనము, రక్షణ సువార్త ప్రకటన కలిగియుండుటను బట్టి ఆనాటి సంఘమును ఈనాడుకూడ గుర్తించగలము. క్రీస్తు రాయబారులు ఒకటవ శతాబ్దములో చేసిన ఉపదేశక్రమమును ఎట్టి పరిస్థితులలో మార్చకూడదని రోమా 16:17లో ఉన్నది. నేడు అనేక సంఘములుగా విడిపోయిన క్రైస్తవలోకములో ఏకత్వము సాధించుట సాధ్యమని క్రొత్తనిబంధన సత్యమును క్రీస్తు సంఘములు బోధించుచున్నవి. దేవునివాక్యమునకు కలుపుటవలనను, తీసివేయుట వలనను మతశాఖలు ఏర్పడుటకు దారితీసింది. ప్రకటన 22:18–20లో యివ్వబడిన హెచ్చరికను మనము గుర్తించవలెను.

ఈ రోజులలో ధనికవర్గమునకు చెందిన యింటర్ డినామినేషనల్ సంస్థలను పోషించుచున్న విదేశ స్వదేశీయులు ఏమార్గమైనా యేసు ప్రభువేగదా యని ప్రబోధించి మతశాఖలను బలపరచుచున్నారు. అయితే క్రొత్త నిబంధనను అనుసరించే క్రీస్తు సంఘము మాత్రము ఆనాడు ఈనాడుకూడ సత్యవాక్యమునకు విధేయతచూపిన వారితో వాక్యపరిచర్యలో ముందుకు సాగిపోవు చున్నది (2 తిమో 2 : 15)

మామిడిచెట్టు విత్తనము భూమిలో పాతిన మామిడిచెట్టు వచ్చును. అదే విత్తనము ఒక కుష్టురోగి చేతితో పాతినకూడ అదే రకపు మామిడిచెట్టు మొలచును. విత్తనము దేవునివాక్యము (లూకా 8:11). ఎన్ని తరాలు జరిగినా రక్షణ మార్గములో మార్పురాదని గుర్తించగలము. ప్రభువా, ప్రభువా అని పిలుచుచు ఆయన చిత్తమును నెరవేర్చక పోయిన యెడల పరలోకమునకు చేరమని యేసు చెప్పెను (మత్తయి 7:21).

—నికోలస్ పేటర్సన్
పాలకొల్లు

# క్రైస్తవులనబడు వారికి విజ్ఞప్తి

లోకములో అనేక మతములు ఉన్నవి. వాటన్నిటిలో ఐక్యత కలదు. గాని క్రైస్తవ మతములో ఐక్యతకలదా? మీ క్రైస్తవమత ములో ఐక్యత కలదా? అని ప్రశ్నించు లోకమునకు మన జవాబేమి?

## దైవగ్రంథము ఇట్లు బోధించుచున్నది

1. కీర్తన గ్రంథము 133:1-3 లో "సహోదరులు ఐక్యత కల్గి నివ సించుట ఎంతమేలు. ఎంత మనోహరము. అది తలమీద పోయబడి అహరోను గడ్డముమీదుగా కారి అతని అంగీల అంచువరకు దిగజారిన పరిమళ తైలమువలె నుండును. సీయోను కొండమీదికి దిగివచ్చు హెర్మోను మంచువలె నుండును. ఆశీర్వాదమును శాశ్వత జీవమును అచ్చట నుండ వలెనని యెహోవా సెలవిచ్చి యున్నాడు" అని వ్రాయబడి యున్నది.

2. మన ప్రభువైన క్రీస్తుకూడ తాను సిలువకు వెళ్లు ఆఖరి గడి యలో తండ్రియైన దేవుని ఇట్లు ప్రార్థించెను: "పరిశుద్ధుడ వైన తండ్రీ, మనము ఏకమై యున్నలాగున వారును ఏకమై యుండునట్లు నీవు నాకనుగ్రహించిన నీ నామమందు వారిని కాపాడుము" (యోహాను 17:11).

3. కొరింథీ 1:10-13 లో అపొస్తలుడైన పౌలు ఇట్లు వ్రాసెను: "సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాట్లాడవలె ననియు, మీలో కక్షలులేక ఏకమనస్సుతోను ఏకతాత్పర్యము తోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను. నా సహో దరులారా, మీలో కలహములు కలవని మిమ్మును గూర్చి క్లోయే ఇంటివారివలన నాకు తెలియవచ్చెను. మీలో ఒకడు

నేను పౌలువాడను, ఒకడు నేను అపొల్లోవాడను, మరియొకడు నేను కేఫావాడను ఇంకొకడు నేను క్రీస్తువాడనని చెప్పుకొనుచున్నారని నా తాత్పర్యము. క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీకొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా?"

4. 1 కొరింథీ 3:1-5 లోనైతే "మీలో అసూయలు, కలహములు వుండగా మీరు శరీరసంబంధులై మనుష్యరీతిగా నడుచుకొనువారుకారా? ఒకడు నేను పౌలువాడను మరియొకడు నేను అపొల్లోవాడనని చెప్పునప్పుడు మీరు ప్రకృతి సంబంధులైన మనుష్యులుకారా?" యని అతడు వారిని గద్దించెను.

5. యోహాను 10:16 లో కాపరి ఒక్కడే మంద ఒక్కటే యని ప్రభువు సెలవిచ్చెను.

6. బైబిలు గ్రంథము 66 పుస్తకములు గల సంపుటియైనను, దాదాపు 40 మంది గ్రంథకర్తలు ఆయా కాలములలో వ్రాయుటకు దాదాపు 1600 సంవత్సరములు పట్టినను ఏకత్వము కలిగి యున్నది.

తండ్రి, కుమార, పరిశుద్ధాత్మయందు మూడు వ్యక్తిత్వములందు ఏకత్వమున్నది. దేవుని శరీరమైన సంఘము ఎచ్చటవుండినను ఏకత్వముకల్గి వుండవద్దా? ఎందుకు లేదు? ఆలోచించుము. ఇంతటి దారుణమునకు కారణమేమై వుండునని వివేచింపరా? ఇన్ని మతశాఖలు దేవుడే స్థాపించి, చిన్నాభిన్నములు చేసెనని తలంతురా?

దయగల దేవుడు జగత్తు పునాది వేయబడకమును పే క్రీస్తునందు లోకమును రక్షించు తలంపు కల్గివున్నట్లు ఎఫెసి 1:6 లో చదువుచున్నాము. కాలము పరిపూర్ణమైనప్పుడు క్రీస్తు యీలోకమునకువచ్చి నేనొక సంఘమును కట్టుదునని వాగ్దానము చేసినట్లు మత్త 16:18లో

కనబడుచున్నది. ఆయన రక్తమిచ్చి సంఘమును సంపాదించినట్లు అపొ. కా. 20:28 సాక్ష్య మిచ్చుచున్నది. రోమా 16:16 సంఘము లన్నియు క్రీస్తువని పలుకుచున్నది. గాన క్రీస్తును అంగీకరించినవా రందరు, ఐక్యతకలిగి యుండుడనియే మా విజ్ఞాపన.

—B. లాజరస్, సజీవపురము.

---

## దేవుని గూర్చి బైబిలు ఏమి బోధించుచున్నది?

**A.** దేవుడున్నాడని అది బోధించుచున్నది: "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆది 1 : 1).

**B.** దేవుడు మానవుని సృజించెనని అది బోధించుచున్నది: "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను" (ఆది 1 : 27).

**C.** దేవుడు ఆత్మయై యున్నాడని అది బోధించుచున్నది: "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను, ఆరాధింపవలెను" (యోహాను 4 : 24).

**D.** దేవుడు నిత్యుడని అది బోధించుచున్నది: "పర్వతములు పుట్టక మునుపు భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగయుగములు నీవు దేవుడవు" (కీర్తన 90 : 2).

**E.** దేవుడు సమస్తమును ఎరిగినవాడని అది బోధించుచున్నది: "మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మన మెవనికి లెక్క యొప్పచెప్పవలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది" (హెబ్రీ 4 : 13).

**F.** దేవుడు సర్వశక్తిమంతుడని అది బోధించుచున్నది: "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధార భూతుడు" (కొలస్స 1 : 17).

G. దేవుడు పరిశుద్ధుడని అది బోధించుచున్నది: "...సర్వాధికారియు, దేవుడు నగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని మానక రాత్రింబగళ్లు చెప్పుచుండును" (ప్రకటన 4:8).

H. దేవుడు ప్రేమమయుడై యున్నాడని అది బోధించుచున్నది: "దేవుడు ప్రేమాస్వరూపి; ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు" (1 యోహాను 4 : 8).

## మంచివాడు మార్పు చెందుట

## *(Conversion of a Good man)*

ప్రస్తుత ప్రజల తలంపునుబట్టి మంచివాడు మార్పు జెందనవసరం లేదు. మంచివాడు మారి క్రీస్తు తట్టు తిరుగవలసిన పనియేమున్నది? దేవునివలన అతడు అంగీకరించబడు ననుటకు నిత్యజీవితానందము అతనికి లభించుననుటకు అతని మంచి జీవితమే గ్యారంటీ కాదా? దీనికి జవాబుగా బైబిలులో సత్పురుషుడును, సద్భక్తియుగల వాడొకడు మార్పుజెంది రక్షింపబడిన సందర్భము ఒకటియున్నది.

కొర్నేలి వందమంది రోమా సైనికుల అధిపతి. ద్వేషింపబడిన యూదుల మధ్యకూడ అతని భక్తిగల జీవితము, ప్రార్థనలు ధర్మకార్యములు ప్రఖ్యాతి గాంచియుండెను. అయితే కొర్నేలి దగ్గరకు దేవుని దూత వర్తమానము తెచ్చినప్పుడు, అతడు తన మంచిజీవితమునుబట్టి ధర్మకార్యములనుబట్టి రక్షణ సంపాదించుకొనెనని చెప్పుటకు కాదు. దేవుడు అతని హృదయమునుబట్టి సంతోషించెను గనుక అతడు సువార్తవిను సదుపాయమును కల్పించెను. తాను రక్షింపబడుటయెట్లో తెలియజేయు పేతురుకొరకు కబురు పంపుమని అతనికి తెలియజేయబడెను (అపొ. కా. 11:14).

ఈలాగా దేవుడు పక్షపాతముగల దేవుడు కాదని పేతురు నేర్చుకొనుచుండెను. అన్యజనులు యూదుల ధర్మశాస్త్రమునకు, ఆచారములకు బద్ధులుకాకుండగానే దేవుడు వారినికూడ యూదులవలెనే అంగీకరించి రక్షించుటకు సంకల్పించెను. పేతురు కొర్నేలి యింటికి

వచ్చి అతనికిని అతని యింటివారికిని క్రీస్తును గూర్చి బోధించెను. అతడును, అతని యింటివారును పేతురు ప్రకటించిన వర్తమానమును విని విశ్వసించిరి, మారుమనస్సు పొందిరి, క్రీస్తునామమున బాప్తిస్మము పొందిరి (అపొ. కా. 10). కొర్నేలీ, నీకొదేములవంటి మంచివారికి ఇప్పటి కింకను "నీవు క్రొత్తగా జన్మించవలెను" అని యేసు ఖచ్చితముగా చెప్పుచున్నాడు (యోహాను 3:3).

"తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది; అది మనయొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమగును? మరియు నీతిమంతుడే రక్షింపబడుట దుర్లభమైతే భక్తిహీనుడును పాపియు ఎక్కడ నిలుతురు?" (1 పేతురు 4:17,18).

---

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA–533 001

**Printed Book only**

**To**

..............................................

..............................................

..............................................

..............................................